# డివైడ్

## అండ్

# రివెంజ్



రచన :

శ్రీ సూర్యదేవర కృష్ణప్రసాద్.

ఆ రోజు కాలేజీలో ఇనాగురల్ ఫంక్షన్.

రంగు రంగు కాగితపు తోరణాలతో, రంగు హంగుల విద్యార్థినీ, విద్యార్థులతో కాలేజి కాంపస్ కోలాహలంగా కళ కళ లాడుతోంది.

అమ్మాయిలతో కబుర్లు చెబుతూ కొందరు, అబ్బాయిలను ఉడికిస్తూ, ఊరిస్తూ కొందరమ్మాయిలు, తమ కళానైపుణ్యాన్నంతా దార పోసి వారిపై కామెంట్స్ చేస్తూ, జోకులు విసురుతు కొందరు, అందరూ సరదాగా నూతనోత్సాహాలతో ఆ వేడుకలో పాల్గొన్నారు. కాంపస్ లోని చెట్ల క్రింద కూర్చొని హాయిగా కబుర్లాడుకొంటున్నారు కొందరు.

లేడీస్ వెయిటింగ్ రూమ్ ప్రక్కనున్న మినీగార్డెన్ దగ్గర కొంద రబ్బాయిలు పడిగాపులు కాస్తున్నారు. నిముషాని కోమారు క్రాపులు సవరించుకొంటూ, వెయిటింగ్ రూమ్‌లోనుంచి కాలు బయట పెట్టిన ప్రతి అమ్మాయిని జోక్సు వేసి వాళ్ళని దాదాపుగా ఏడిపించి పంపుతున్నారు. వీళ్ళకి భయపడి కొందరమ్మాయిలు ఆ వెయిటింగ్ రూమ్ లోనే కూర్చొని నక్కి నక్కి చూస్తున్నారు.

ఏమిటి నీరజా! త్వరగా కానివ్వమ్మా తల్లీ అందరము కలిసే వెళ్దామంటుంటె వినవే, అంటూ నీరజ భుజాలు పట్టుకు బ్రతిమాలుతోంది లలిత.

"ఆ. అయిపోయింది...ఇక పదవే తల్లి! నీ వెదవ పౌడర్ నువ్వూను. నా ఖర్మకాలి ఇవ్వాళే పౌడర్ మరచి పోయొచ్చాను. నీ పౌడరంతా తినేసినట్లే అల్లాడుతున్నావు."

ఊ ఇక పద పద" అంటూ గబా గబ పౌడర్ టిన్ లలిత చేతికిచ్చి, మళ్ళీ అద్దంలో తన ప్రతిబింబము చూచుకొంది.

"నీకేం తల్లి: రోజుకొక డబ్బా చొప్పున

వాడతావు. నాకు కనీసము రెండు వారాలు అయినా రావాలి, అంటూ పౌడర్ టిన్ హ్యాండ్ బాగ్‌లో సర్ది వెయిటింగ్ రూములో నుంచి గబగభా బయట కొచ్చింది. బయట అల్లరిగుంపును చూడగానే అలిగి లోపలికి పరుగెత్తింది. నేనొస్తున్నాన్లే పద తల్లీ అంటున్నా నీరజను వారిస్తూ, అది కాదే బయట ఆరోగ్న-వాళ్ళే కె.జి.ఆర్.ఎస్. గుంపు ఉందే! బయట కెళ్తున్న మనవాళ్ళని గొడవచేస్తున్నారే! అంది లలిత కొద్దిపాటి అయాసంతో.

"కె. జి. ఆర్. ఎస్సా"?

ఆఁ అవునే! ఆ కె.జె.ఆర్.ఎస్. వెధవలే. వాళ్ళ ఆగడాలు మరీ మితిమీరిపోతున్నాయి. నాలుగురోజుల క్రితము జూఆలజీ మేడం కొంగుకి కప్పను కట్టారట. మరి నిన్నేమో మన సరోజ జడపట్టుకులాగి తల్లోపూలు తురిమారా "అసలింతకి ఈ వెధవ కాలేజీలో చదవటం బుద్ధి తక్కువ" అంది ఆవేశంగా.

నోర్ముయ్యవే! అసలు వాళ్ళ కింత కాళ్ళు తెచ్చింది మనమే! నిన్న ఆ మొద్దు...అట్లా అమ్మమ్మలా శోకాలు పెట్టకుండా లాగి పెట్టి దవడలు పగలు గొట్టినట్లయితే కాళ్ళుపట్టుకొనే వాళ్ళు...

సరేలే తల్లీ! నీకేం ఎన్నికబుర్లైనా చెబుతావు, గొంతు వరకు నీళ్ళువస్తేగాని చెరువు లోతు తెలీదు.

నాక్కూడే తెలియాల్సింది. ఆ బ్రూట్సుకే తెలిసేలా చేస్తాను. రా...అని లలిత చేయి పట్టుకొని గభాగబ బయట కొచ్చింది నీరజ.

బయట కె. జి. ఆర్. ఎస్. అనబడుతున్న కిరణ్, గోపీచంద్, రవి, శ్యాంల అల్లరి తారాస్థాయికి చేరింది, రేగి పళ్ళుదోసిల్లా నిండా పోసుకొని ఒక్కోపండు కొరికి గింజలు వెయిటింగ్ రూంలో నుండి వస్తున్న అమ్మాయిల ప్రక్క ఊస్తున్నారు.

అరేయ్ శ్యాం! "వస్తోందిరోయ్" మన పుత్తడి బొమ్మ! ఇదసలు మన లిస్టులో కెక్క లేదురా...ఒక పట్టుపడదాం...అంటుండగా ఎంగిలిలో జివుటకారుతున్న రేగి పళ్ళగింజలు నీరజ ముఖం నిండా పడ్డాయి.

"యూ, యూ డెవిల్స్..."!

హ-హాహ్హ బ్రూటుస్ ..ఎహ్హే హాయ్ హాయ్ బొమ్మా...పుత్తడి బొమ్మ...అయింది చూడర ఇత్తడి బొమ్మ...ఓహోహో.

నీరజ కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది... ఆవేశము అవమానము నిలువెల్లావణికించేస్తున్నాయి. వాళ్ళకి గుణపాఠం చెప్పాలనుకున్నా ఏమీ చేయలేక పరుగుపరుగున కాలేజి కాంపస్ దాటింది వెనుక నుంచి లలిత పిలుపు లేవి వినపట్టం లేదు. కె.జి.ఆర్.ఎస్. కూతలే వినిపిస్తున్నాయి. ఇంటికి ఎలా చేరిందో తనకే తెలియదు.

ఏమిటి నీరజా! అంతగప్పాలు కొట్టిన నువ్వే ఇలా కాలేజి నుంచి వెళ్ళిపోతే ఇక మిగిలిన వాళ్ళేమి అనుకోవాలి అంది లలిత.

ఒసే పిచ్చిదానా ఇక మిగిలిన వాళ్ళకేమీ భయంలేదు. ఆ వెధవలు ఇంక ఎవర్నీ ఏమీ అనలేరు. అలా జరగకపోతే పేరు నీరజే కాదు. నేను ఈ కాలేజి చదువులు చదవను.

నీరజా! అదెలా సాధ్యమవుతుంది? అంది లలిత.

ఒసే పిచ్చితల్లీ "డివైడ్ అండ్ రూల్" అన్న బ్రిటీష్ పాలసీలాగే నా పాలసీ "డివైడ్ అండ్ రివెంజ్."

ఏమిటి నువ్వంటున్నది నాకు అర్థంకావటం లేదు కాస్త వివరంగా చెప్పవే అందిలలిత.

చెప్తా...చెప్తా. ఉ...అసలెందుకు ఈ లెటర్స్ చదువు నీకే తెలుస్తుంది. అంటూ నాలుగు ఉత్తరాలు తీసి లత చేతికి ఇచ్చింది నీరజ.

లలిత లెటర్ చదవటము మొదలుపెట్టింది.

ప్రియమైన కిరణ్ గారికి—

నేను ఇన్నాళ్ళు మిమ్మల్ని ఎంతగానో ఆరాధించాను. మీ పర్సనాలిటీ నన్ను ఎంతగానో ఆకర్షించింది. మీ పట్ల అభిమానాన్ని ఏర్పరచుకొన్నాను. మీరు ఒంటరిగా కనిపిస్తే నా బాధ వెల్లడించాలనుకొన్నాను. మీరు ఏనాడు నాకు ఆ అవకాశము ఇవ్వలేదు పైగా మీ స్నేహితులంతా నన్నూ... మిమ్మల్ని అభిమానిస్తున్న నన్ను ఇంతగా అవమానిస్తున్నా మీ కేమి పట్టనట్టు ఊరుకున్నారు. నా ఫ్రెండ్సు కొందరమ్మాయిలు ద్వారా నేను మీ పట్ల ఆకర్షించబడటాన్ని మీ ఫ్రెండ్సు తెలుసుకొని మీ ముందే నన్ను అవమానించారు. మిమ్మల్ని అభిమానించినందుకు నాకీ శిక్ష కావల్సిందే కాని మీ స్నేహితులు గొప్పవాళ్ళే! అయితే నా బాధ ఒక్కటే, మీరు నమ్మిన మీ ఫ్రెండ్సు ఇలాగే ఇంకెంత ద్రోహం చేస్తారో, కాస్త మెలకువగా ఉండమని కోరుతూ...

మిమ్మల్ని అభిమానించే
నీరజ.

అలాగే మిగిలిన మూడు ఉత్తరాలు రవి, శ్యాం, గోపీచంద్ లకు దాదాపుగా అదే సారాంశముతో వ్రాసినది.

ఏమిటి నీరజా! ఈ పని, వాళ్ళు ఈ ఉత్తరాలు నమ్మి నీ వెంటపడితే నీకేమి కావాలి!

అలా జరక్కుండానే పదిహేను రోజులు ఈ కాలేజీలో ఉండి వారి పాట్లు కనులారా చూసి చెవులారా విని ఆ తర్వాత టి. సి. తీసుకొని మా అన్నయ్య దగ్గరకు వెళ్తాను. ఇక నా చదువు అక్కడే. ఈ ఉత్తరాల మహిమ ఆ వెధవల్ని ఏమి చేసేది నువ్వే చూస్తావు.

నీరజ వ్రాసిన ఉత్తరాలు మూలంగా కె. జి. ఆర్. ఎస్. లకు మనస్పర్థలు ఏర్పడినాయి. సామాన్యంగా స్నేహితులకు తగాదాలు డబ్బు దగ్గర లేక ఆడదాని దగ్గర వస్తాయి. ఇది జరుగుతున్న నిజం.

నీరజ కోసం ఎవరికి వారే ఒంటరిగా నీరజతో ముందు మాట్లాడాలని ఎవరికి వారే తప్పుకు తిరుగుతున్నారు. నీరజ వాళ్ళకి తనతో మాట్లాడే అవకాశము ఇవ్వకుండా ఎవరోకరి తోడుతోనో కాలేజికి వస్తూపోతుంది. కె.జి.ఆర్.ఎస్. బృందములో ఎవరికి వారే తమకు అడ్డువస్తున్నారని, ఒకళ్ళ మీద ఒకళ్ళకు ద్వేషాలు ఏర్పడి "ఎవరికి వారే యమునా తీరే" అన్నట్టుగా విడిపోయారు. నీరజ కలలు ఫలించాయి. తర్వాత నీరజ టి. సి. తీసుకొని తెనాలిలో ఉన్న వాళ్ళన్నయ్య దగ్గరకు వెళ్ళిపోయింది.


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు
సంవత్సర చందా ... రూ. 9-00
(రెండు ప్రత్యేక సంచికల సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును.

♦ కథాంజలి ♦

నెం. 10, మురుగేశ మొదలి వీధి,
మదరాసు - 600 001.